ప్రజాశక్తి

సోమవారం 18 మార్చి 2024

విశాఖ నగరంలో బెంచీలపై నెంబర్లు వేస్తున్న పరీక్షల నిర్వహణా సిబ్బంది

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, అనకాపల్లి విలేకరులు

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందుకుగాను అధికార యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ చేసింది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. పరీక్షలకు సంబంధించి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ప్రతి రోజూ ఒక పేపర్ ఉంటుంది. పరీక్షలకు విశాఖపట్నం జిల్లా నుంచి 31,379 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో 28,367 మంది రెగ్యులర్ వారు కాగా, 3,012 మంది ప్రైవేట్ విద్యార్థులు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,972 మంది బాలురు, 13,395 మంది బాలికలు ఉన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 138 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 48 'ఎ' కేటగిరీ కేంద్రాలు, 81 'బి' కేటగిరీ కేంద్రాలు, 9 'సి'కేటగిరీ కేంద్రాలు ఉన్నాయి. స్టోరేజీ కోసం 33 పోలీస్ స్టేషన్ పాయింట్లను గుర్తించారు. 14 రూట్‌లు ఏర్పాటు చేశారు. ఐదుగురితో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థుల సహాయార్థం 9248818959, 7780453490 నెంబర్లను అందుబాటులోకి తెచ్చారు.

అనకాపల్లి జిల్లాలో 21,259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 10,873 మంది, బాలికలు 10,386 మంది రెగ్యులర్ విద్యార్థులు. ప్రైవేట్ విద్యార్థులు 2,324 మంది ఉన్నారు. జిల్లాలో 108 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసాధికారులు తెలిపారు. ఆర్‌టిసి పరీక్ష రాసేవారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

'జగనన్నకు చెబుదాం' రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం, డయల్ యువర్ మేయర్ కార్యక్రమాలను ఎన్నికల ప్రవర్తనా నియమావళి సందర్భంగా రద్దు చేసినట్టు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

జర్నలిస్టుల అంశాలను మ్యానిఫెస్టోలో చేర్చాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టులకు సంబంధించిన అంశాలను కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్‌ఎన్‌ఎ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు కాళిదాసులు కాంగ్రెస్ అధికార ప్రతినిధి తులసి రెడ్డికి, ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టుల సమస్యలకు వివరించారు. నామమాత్రపు ధరకు ఇళ్ల స్థలాలు, ఇతర రాష్ట్రాల మాదిరిగా రూ.10 వేలు చొప్పున పెన్షన్లు, కోవిడ్‌తో మరణించిన జర్నలిస్టులకు రూ.5 లక్షల పరిహారం, జర్నలిస్టులపై దాడుల నివారణకు హై పవర్ కమిటీలు, వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఉచితంగా జారీ, స్థానిక పత్రికలకు సహకారం తదితర వాటిని మ్యానిఫెస్టోలో పెట్టాలన్నారు.

అభ్యర్థుల కోసం అన్వేషణ

◆ అనకాపల్లి ఎంపీ టికెట్‌పై తేల్చుకోలేకపోతున్న వైసిపి, బిజెపి

◆ స్థానికేతరుడైన సిఎం రమేష్‌ను బరిలోకి దించే యోచనలో కమలం

◆ వైసిపి పరిశీలనలో కాశీ విశ్వనాథం, రమాకుమారి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి ఎంపీ అభ్యర్థి కోసం ప్రధాన పార్టీలు అన్వేషిస్తున్నాయి. ఎవరిని పోటీలో పెట్టాలన్న కసరత్తు చేస్తున్నాయి. శనివారం రాష్ట్రంలో అనకాపల్లి తప్ప మిగిలిన ఎంపీ స్థానాలన్నింటిలోనూ అభ్యర్థులను వైసిపి ప్రకటించింది. సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి తనకు టికెట్ వస్తుందని ఆశతో ఇప్పటికీ వున్నారు. ఆమెకు మళ్లీ టికెట్ ఇవ్వాలన్న ఆలోచన పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి వుంటే అందరితో పాటు అనకాపల్లి ఎంపీ అభ్యర్థినీ శనివారం ప్రకటించేవారు. ఈ టికెట్ పెండింగ్‌లో పెట్టడంతోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిసికి టిక్కెట్ ఇవ్వనున్నట్లు ప్రకటించినా మహిళకా, పురుషునికా అనే స్పష్టత ఇవ్వకపోవడంతో ఆశావహుల్లో ఆశలు పెరిగాయి. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో బిజెపికి అనకాపల్లి ఎంపీ స్థానాన్ని కేటాయించడంతో ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించే వరకు వేచిచూడాలన్న వైఖరిలో వైసిపి వుంది. బిజెపి అభ్యర్థిగా సిఎం రమేష్‌ను బరిలోకి దించుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. రమేష్ రాజకీయ నేపథ్యం టిడిపితో బలంగా వుండడంతో ఆయనైతే టిడిపి పనిచేస్తుందన్న ఆలోచనలో బిజెపి వుంది. టిడిపి అధినేత చంద్రబాబుకు ఆయన అత్యంత సన్నిహితుడు కావడంతో రమేష్ విజయంపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెడతారన్న అభిప్రాయం కొంతమంది కార్యకర్తల్లో వుంది. అయితే, స్థానికేతరుడైన రమేష్‌ను బరిలోకి దించితే టిడిపి నేపథ్యమున్నా, ఆ పార్టీ నాయకత్వం సహకరించే పరిస్థితిలేదు. మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు తన తనయుడు విజయ్‌కు అనకాపల్లి ఎంపీ టిక్కెట్ ఇవ్వకపోతే.. పార్టీ జెండా మోసిన స్థానికునికి ఇవ్వాలని గతంలోనే ప్రకటించారు. పొత్తులోనైనా, సొంత పార్టీ వ్యక్తయినా స్థానికేతరుడైతే టిడిపి నాయకత్వం సహకరించడానికి సుముఖంగాలేదు.

సిఎం.రమేష్ (బిజెపి)

రమాకుమారి (వైసిపి)

కాశీ విశ్వనాథం (వైసిపి)

కనీస బలంలేని బిజెపికి అనకాపల్లి ఎంపీ స్థానం కేటాయించడంపై కూడా ఆ పార్టీ నాయకత్వంలో అసంతృప్తివుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని మూడు పార్లమెంట్ స్థానాల్లో రెండింటిని బిజెపికి కేటాయించడంపై చంద్రబాబు తీరుపై ఆ పార్టీ నాయకత్వంలో అసంతృప్తి గూటుకట్టుకొనివుంది. అన్ని బలాలున్న సిఎం రమేష్‌కు టిక్కెట్ ఇవ్వడానికే బిజెపి మొగ్గు చూపుతోంది. బిజెపి తన అభ్యర్థిని ప్రకటించాక స్థానికుల్లో ధీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని వైసిపి యోచిస్తోంది. అందుకనే అనకాపల్లి అభ్యర్థిని పెండింగ్‌లో వుంచింది. ఆడారి ఆనందకుమార్‌ను పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో పెట్టడడంతో.. ఆయన సోదరి రమాకుమారికి టిక్కెట్ ఇచ్చే విషయమై పార్టీ పునరాలోచనలో పడినట్లు తెలిసింది. నర్సీపట్నం నియోజకవర్గ వైసిపి పరిశీలకునిగావున్న, ఆ నియోజకవర్గానికి చెందిన బొడ్డేడ కాశీ విశ్వనాథం అనకాపల్లి ఎంపీ టికెట్‌కు గతంలో దరఖాస్తు చేసుకున్నారు. తమకున్న సానుకూలంశాలను జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ అభ్యర్థిగా కాశీ విశ్వనాథం పేరు కూడా పరిశీలనలో వున్నట్లు ప్రచారం నడుస్తోంది.

కార్యాలయ ప్రారంభ సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

సిపిఎం 86వ వార్డు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 86వ వార్డు సిపిఎం కార్యాలయాన్ని దువ్వాడ వంతెనకు సమీపంలో ఆదివారం సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఎం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ పేదలు, కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతోందని, నీతి నిజాయితీలకు మారుపేరుగా ఉంటుందని తెలిపారు. ప్రజల కోసం పోరాటాలు చేస్తూ అనేక కేసులు నెత్తి మీద వేసుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్న నాయకులు కమ్యూనిస్టులు అని గుర్తు చేశారు. గతంలో తాను ఇళ్లు లేని పేదల కోసం పోరాటం చేసినప్పుడు, కార్మికుల సమస్యపై పోరాడినప్పుడు తనపై పలు కేసులు ఉన్నాయని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలో ఎవరూ డబ్బు కోసం పని చేయరని, ప్రజల ఆశయాల కోసం పనిచేస్తారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సిపిఎం తరపున బరిలో నిలిచే అభ్యర్థులను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, సిఐటియు నాయకులు ఎం.కృష్ణారావు, పి.శ్రీనివాసరాజు, వైటి.దాస్, యు.రామస్వామి, డిసిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి రూ.లక్ష విరాళం

స్టీల్‌ప్లాంట్ విరమణ ఉద్యోగి దత్తాత్రేయ రాజు రూ.లక్ష విరాళాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుకు అందజేశారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో 1989లో విధుల్లో చేరిన దత్తాత్రేయరాజు 1990లో సిఐటియులో చేరారు. అప్పటినుంచి స్టీల్ ప్లాంట్‌లో యూనియన్ తరుపున వివిధ విభాగాల్లో పనిచేశారు. 2023 డిసెంబర్‌లో ఆయన ఉద్యోగ విరమణ పొందారు. పార్టీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ విరాళాన్ని ప్రకటించినట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

◆ సువిధ యాప్ ద్వారా ప్రచార అనుమతులు

◆ విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అందరూ అందుకు అనుగుణంగా నడుచుకోవాలని, కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన పద్ధతులను ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే..

ఎన్నికల నేపథ్యంలో పార్టీల అభ్యర్థులు ప్రచారానికి ఎలాంటి అనుమతులు తీసుకోవాలి ?

పోలీసు విభాగానికి సంబంధించి అన్ని రకాల అనుమతులూ సువిధ యాప్ ద్వారా అందిస్తాం. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌కు లోబడే నడుచుకోవాలి. ర్యాలీలు, వాహనాల వినియోగం, ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు సువిధ యాప్ ద్వారా పొందవచ్చు. ఉదయం 6.00 నుంచి రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే అభ్యర్థులు ప్రచారం చేపట్టాలి.

ఎన్నికల్లో పోలీసు విభాగం తీసుకుంటున్న చర్యలేంటి ?

తనిఖీల నిమిత్తం ప్రస్తుతం నగరంలో ఐదు చోట్ల చెక్ పోస్టులు పెట్టాం. భవిష్యత్తులో వీటి సంఖ్య పెరగనుంది. సర్ప్రైజ్ తనిఖీలు చేస్తాం. అంతర్ జిల్లాల సరిహద్దులో చెక్ పోస్టులు నిరంతరం పని చేస్తాయి. ఆయుధాలు ఉంటే అభ్యర్థులు డిపాజిట్ చేయాలి. నగదు, మద్యం తరలింపు తదితర అంశాలపై నిరంతరం నిఘా ఉంటుంది.

జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయా ?

జిల్లాలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు ఎక్కడా లేవు. క్లిష్టమైన కేంద్రాలు మాత్రం 478 ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా తగు చర్యలు చేపట్టాం.

ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జెసి మయూర్ అశోక్

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం విశాఖలో ప్రశాంతంగా సాగింది. ఉదయం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలోగల పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కె మయూర్ అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి అందుబాటులో ఉందా ? లేదా ? అని గమనించారు. పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు.

'పది' పరీక్షలకు పటిష్ట బందోబస్తు

● జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ

ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 18 నుంచి 30వరకు జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ తెలిపారు. జిల్లాలో 108 కేంద్రాల్లో 21,259 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరిలో 10,873 బాలురు, 10,386 బాలికలుండగా, 2,324మంది ప్రైవేట్ విద్యార్థులున్నారన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 8.30 గంటలకు చేరుకోవాలని, 8.45 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష పూర్తయ్యేంతవరకు కేంద్రం నుండి విద్యార్థులు బయటకు వెళ్లేందుకు అనుమతించరన్నారు. సున్నితమైన పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు. విద్యార్థులంతా హాల్ టికెట్‌లో సూచించే నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు వంటి ఎలక్ట్రానిక్ పరికారాలను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించరని, వాటిని తీసుకొస్తే భద్రతగా బయట ఉంచుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని సూచించారు. పరీక్షా కేంద్రాలకు దగ్గర్లో ఉన్న జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసేయాలని సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, పరీక్షా కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడడం నిషేధమన్నారు. విద్యార్థులు మాల్ ప్రాక్టీసెస్, చెడు ప్రవర్తనకు పాల్పడితే, ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీస్ అండ్ అన్‌ఫైర్ మీన్స్ యాక్ట్, 1997 అను చట్టం ప్రకారం కఠినమైన చర్యలకు బాధ్యులౌతారని హెచ్చరించారు.

'డైట్'లో ఎన్‌సిటిసిటి జాతీయ సదస్సు



జాతీయ సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో డైట్ సిఎస్‌ఇ, సిఎస్‌డిఎం విభాగం, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్‌ఐ) స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో 'ట్రెండ్స్ ఇన్ కంప్యూటింగ్ టెక్నాలజీపై జాతీయసదస్సు నిర్వహించారు. ఎన్‌సిటిసిటి కోకన్వీనర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాన్ఫరెన్స్, వర్క్‌షాప్స్ నిర్వహణలో విద్యార్థుల్లో సాంకేతికత, నైపుణ్యశిక్షణ పెంపొంది ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. ఎన్‌సిటిసిటి కన్వీనర్ డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ ఈ సదస్సులో వివిధ కాలేజీల నుంచి 150 పత్రాలురాగా, వాటిలో ఉత్తమమైన వందింటిని ఎంపిక చేశామన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రతి నెలా విద్యార్థులకు ఉపయోగపడే కార్యకలాపాలు నిర్వహిస్తున్నా మన్నారు. ముఖ్యఅతిథులు సి. ఉదయ్‌కుమార్, వివిఎల్‌పి లాల్ మాట్లాడుతూ విద్యార్థుల అకడమిక్ కెరీర్‌కు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తున్న డైట్ పాలకమండలి, యాజమాన్యాన్ని అభినందించారు. డైట్ చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ డైట్‌లో కంప్యూటర్ విభాగం యాక్టివ్‌గా ఉందన్నారు. సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను, కొత్త సభ్యులకు గుర్తింపుకార్డులను అందజేశారు.

ఎన్నికల కోడ్ పక్కా అమలుకు చర్యలు

● అధికారులకు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి దిశానిర్దేశం ● కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్నికల కోడ్ పటిష్ట అమలుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిలో సూచించిన ముందస్తు పనులు చేపట్టాలన్నారు. ఎన్నికల అనుబంధ కమిటీలు నిర్దేశిత విధులను తుచ తప్పకుండా పాటించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలు, ఆస్తుల లోపల బయట ఎటువంటి హోర్డింగులు, రాజకీయ నాయకుల బొమ్మలుకనిపించరాదన్నారు. విగ్రహాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుపరాదన్నారు. అంతకు ముందు విజయవాడ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల కమిషనర్ ఎం.కె.మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించిన ఆదేశాలను వివిధ ఎన్నికల విభాగాల నోడల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పరిశీలించారు. నోడల్ అధికారుల ఆదేశాలతో ఎంసిసి, ఎంసిఎంసి, వీడియో వీవింగ్, వీడియో సర్వేలెన్స్, మొదలైన టీమ్‌లన్నీ నిబద్ధతతో పనిచేయాలన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో ఎన్నికల ప్రక్రియను ఇక్కడి నుండే పర్యవేక్షించి, రిపోర్టులను ఎన్నికల కమిషన్‌కు నివేదించనున్న నేపథంయలో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రూట్ మ్యాపులు అందుబాటులో వుండాలన్నారు. కార్యక్రమాల్లో సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, కంట్రోల్ కమాండ్ రూమ్ నోడల్ అధికారి ప్రసాదరావు, ఎన్నికల ఖర్చు విభాగం నోడల్ అధికారి జి.సత్యనారాయణ, ఎంసిఎంసి నోడల్ అధికారి జి.వి.లక్ష్మి, డిపిఆర్వో డి.సాయిబాబా, డిఆర్‌ఒ బి. దయానిధి, నర్సీపట్నం, అనకాపల్లి ఆర్‌డిఒలు హెచ్.వి.జయరామ్, ఎ.చిన్నికృష్ణ, జిఎస్ డబ్ల్యుఎస్ మంజులవాణి, డిఆర్‌డిఎ పిడి శచీదేవి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఏ.హేమంత్, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, డిసిఓ కిరణ కుమారి, లీడ్ బ్యాంకు మేనేజరు సత్యనారాయణ, మత్స్యశాఖ డిడి ప్రసాద్, డిఎస్‌ఒ కెవిఎల్ మూర్తి పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు సమిష్టిగా పనిచేద్దామని సీనియర్ ఎన్‌టిఆర్ అభిమాన సంఘం పిలుపునిచ్చింది. ఆదివారం సత్యనారాయణపురం కొబ్బరి తోటలో అభిమాన సంఘం ఆత్మీయ సమావేశంలో పలువురు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకునిగా, మాజీ ముఖ్యమంత్రిగా పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలుచేసి, నీతి, నిజాయితీలతో ఆదర్శవంతమైన పాలనను అందించిన ఘటన ఎన్‌టిఆర్‌కే దక్కుతుందని, అటువంటి మహనీయుని ఆశయసాధన అందరి లక్ష్యం కావాలన్నారు. ముఖ్యఅతిథి ఎన్‌టిఆర్ లిటరేట్స్ అధ్యక్షులు, విద్యాశాఖ విశ్రాంత అధికారి కర్రి దివాకరరావు మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్‌టిఆర్ పేరుతో ఉన్న సంక్షేమ పథకాలతోపాటు వైద్యవిశ్వవిద్యాలయానికి ఉన్న ఎన్‌టిఆర్ పేరును తొలగించి, మార్పు చేయడం దుర్మార్గమన్నారు. సుంకరమెట్ట సత్యనారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ధనాల విష్ణు చౌదరి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవంతోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. సీనియర్ ఎన్‌టిఆర్ అభిమాని, విశ్రాంత ఖజానాశాఖ అధికారి వడ్డాది లక్ష్మణరావు మాట్లాడుతూ అభిమానుల మదిలో చిరస్థాయిలో నిలిచిన మహోన్నత నేత ఎన్‌టిఆర్ అన్నారు. విశ్రాంత సిఐ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ స్ఫూర్తితోనే తాను పోలీసు అధికారి స్థాయికి ఎదిగానన్నారు. ఎన్‌టిఆర్ అభిమాన సంఘ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, ఆయన పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సీనియర్ అభిమాని కర్రి శివన్నారాయణ మాట్లాడుతూ కారణజన్ముడు ఎన్‌టిఆర్‌తో కలిసి ప్రయాణించడం తాను చేసుకున్న అదృష్టమన్నారు. సంఘం అనకాపల్లి శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేదుల వెంకటరామారావు (బందావన్), పెనుమత్స వెంకటేశ్వరరాజు, వానపల్లి త్రినాధ్, నెల్లూరు సాంబశివరావు, నాగభూషణం, వెంకటేశ్వరరావు, కుమార్, కొండలరావు, కెవిఎస్. అప్పారావు, భోగలింగం, నాయుడు, శివాజీ, బుల్లిబాబు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో సీనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు

పెందుర్తి ఎమ్మెల్యే టిక్కెట్ బండారుకు కేటాయించాలని

టిడిపి శ్రేణుల నిరసన ర్యాలీ

ర్యాలీ చేస్తున్న టిడిపి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - సబ్బవరం: పెందుర్తి ఎమ్మెల్యే టిక్కెట్ టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ టిడిపి నేతలు ఆదివారం నియోజకవర్గంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా తన జీవితాన్ని పార్టీకే అంకితం చేసి, కష్టకాలంలో కేడర్ చెక్కుచెదరకుండా కాపాడిన ఘనత బండారుకే దక్కుతుందన్నారు. వైసిపి పాలనలోని అవినీతిని, భూకబ్జాలను ఎండగట్టడంతోపాటు, వారి విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టిన సత్తా ఉన్నవారిలో బండారు ఒకరన్నారు.

బండారుకు టిక్కెట్ ఇవ్వకుంటే పార్టీ మనుగడ కష్టమేనని హెచ్చరించారు.పార్టీ అధిష్టానం పునరాలోచన చేయాలని, పొత్తులపై మాట్లాడి, బందారుకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలన్నారు. ఈ మేరకు సబ్బవరం నుంచి పెందుర్తి, పరవాడ మీదుగా బండారు నివాసం వరకు నిరసన ర్యాలీ చేశారు. టిడిపి నేతలు కరకదేముడు, మడక పార్వతి, వేగి పరమేశ్వర రావు, భర్నికాన బాబూరావు, కోటాన అప్పారావు, గవర అప్పారావు, రేసుపూడి రమణ, పల్లా తాతారావు, ఆకుల గణేష్, పడాల వెంకటరమణ, గవర సత్యనారాయణ, పెద్దాడ రమణమ్మ, మూడు మండలాల టిడిపి కార్యకర్తలు,అభిమానులు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

సిపిఎం ఉద్యమాలకు రూ.లక్ష విరాళం

జిల్లా కార్యదర్శి లోకనాథంకు విరాళాన్ని అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సిపిఎం ఉద్యమాలకు మండలంలోని హరిపురం గ్రామంలో ప్రజల నుంచి సేకరించిన విరాళం రూ.లక్షను ఆపార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథంకు ఆదివారం పార్టీ నేతలు అందజేశారు. కార్యక్రమంలో అచ్చుతాపురంకన్వీనర్ ఆర్ .రాము, గ్రామశాఖ కార్యదర్శి బి.రామ్ కుమార్, సిపిఎం సీనియర్ నేతలు కాండ్రేగుల రామసదాశివరావు, ఎస్.కన్నంనాయుడు, బాబూరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

లౌకిక, వామపక్ష శక్తులు ఏకం కావాలి

లాజరస్ సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారత నాస్తిక సమాజం, సిఐటియు నాయకులు సిహెచ్.ఎఫ్ లాజరస్ సంస్మరణ సభ కంచరపాలెంలోని కాగిత పైడయ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ, మనువాద హిందూ పాసిస్ట్ శక్తులను ఓడించడానికి లౌకిక వామపక్ష శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడుకోవటం కోసం భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన భారత నాస్తిక సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నూకరాజు మాట్లాడుతూ, లాజరస్, వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్‌తో కలిసి నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. లాజరస్‌తో ఉన్న అనుభవాలను ప్రజానాట్యమండలి నాయకులు పి.రామారావు వివరించారు. హిందుస్థాన్ షిప్ యార్డ్‌లో కార్మిక రంగానికి లాజరస్ చేసిన కృషిని బి.సత్యానందరావు (ఎఐటియుసి), రెడ్డిపల్లి బాబూరావు (సిఐటియు), ఎంవిఎన్ఆర్.పట్నాయక్, ఎంఎన్.బుద్ధ (పెన్షనర్ యూనియన్ నాయకులు) వివరించారు. లాజరస్ చిత్రపటం వద్ద షిప్‌యార్డ్ ఉద్యోగులు, భారత నాస్తిక సమాజం కార్యకర్తలు, లాజరస్ కుటుంబ సభ్యులు, లాజరస్ సహచరి గౌరి పూలు జల్లి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, సునీత, అజయ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యపు కుంచెలతో జూ అధికారులు, సిబ్బంది

ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, హరిత వికాస్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యాన ఆదివారం జూ పార్కులో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా జూ పార్కులో ఉన్న చెట్లకు ధాన్యపు కుంచెలను వేలాడ దీసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వల్ల పర్యావరణంలో పిచ్చుకలు అంతరించి పోతున్నాయన్నారు. వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ప్రకృతిలో ప్రతి జీవీ ఎంతో అవసరమైనదని, వాటన్నింటినీ రక్షిస్తూ జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం జూ పార్కులోని సుమారు 500 ధాన్యపు కుంచెలను చెట్లుకు కట్టారు. ఈ కార్యక్రమంలో డిసిఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపాలనాయుడు, ఫారెస్టు సెక్షన్ అధికారులు భారతి, రాజేశ్వరరావు, హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు దాలినాయుడు పాల్గొన్నారు.

కెకె.రాజుకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కెకె.రాజు పేరును ప్రకటించడంపై అభినందనలు వెలువెత్తుతున్నాయి. నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో కెకె.రాజుకు స్థానికులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా కెకె.రాజు గెలుపునకు శ్రమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు, 45వ వార్డు అధ్యక్షులు పైడి రమణ, శ్రీ భక్త మార్కండేయ సేవా సంఘం సభ్యులు, వైసిపి శ్రేణులు నంబాల రాజేష్, బోట్టా రాజు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భీమిలి టికెట్ రేసులో గంటా, కోరాడ

ఎటూ తేలక సందిగ్ధంలో టిడిపి కేడర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి టిడిపి టికెట్ కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. తనకే టికెట్ ఇవ్వాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు వారి వారి స్థాయిల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగానే గంటాకు సమీప బంధువు మాజీ మంత్రి నారాయణతో కలిసి శనివారం పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారని అతని అనుచరులు చెబుతున్నారు. గంటాను విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో పోటీచేయాలని పార్టీ అధిష్టానం చెప్పినప్పటికీ, తనకు భీమిలిలో టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. గంటా కు భీమిలి టిక్కెట్ ఇచ్చేందుకు అధిష్టానం ఎందుకనో సుముఖంగా లేదని తాజా రాజకీయ పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. 2019లో ఇక్కడ విజయావకాశాలు ఉన్నప్పటికీ ఇక్కడ నుంచి పోటీకి అయిష్టత కనబరచడంతో ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది అతని సొంత నిర్ణయానికి అధిష్టానం వదిలేయడంతో విశాఖ ఉత్తర
నియోజక వర్గానికి వెళ్లి అక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక్కడి నుంచే పోటీ చేస్తానంటూ పార్టీ క్యాడర్‌ను నమ్మించి విశాఖ ఉత్తరానికి వెళ్లడం, అనివార్యంగా ఇక్కడ సబ్బం హరిని పోటీలో నిలపడం చక చకా జరిగిపోయాయి. అయితే సబ్బం హరి అభ్యర్థిత్వం పట్ల మెజారిటీ పార్టీ కేడర్ అయిష్టతను వ్యక్త పరిచింది. ఇదే ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. వైసిపి అభ్యర్థి ముత్తం శెట్టి శ్రీనివాసరావు గెలుపొందారు. గంటా ఉత్తరానికి వెళ్లేటప్పుడు కూడా కోరాడ రాజబాబు స్థానికులకు టికెట్ ఇవ్వాలని కోరారు. అయినా సరే పార్టీ అధిష్టానం అతని విన్నపాన్ని పెడ చెవిన పెట్టింది. గెలవగలిగే భీమిలి, వైసిపి పరం కావడంతో ఆనాటి నుంచి గంటా వైఖరిపై అధిష్టానం ఒకింత అయిష్టతతో ఉన్నట్లు ప్రస్తుత రాజకీయ పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. గంటా అభ్యర్థనను అధిష్టానం తిరస్కరిస్తుండడానికి మరిన్ని బలమైన, అంతర్గత కారణాలు ఉన్నట్టు అదే పార్టీలో చర్చ నడుస్తోంది.

పట్టు బిగిస్తున్న" కోరాడ"

సబ్బం హరి ఓటమి చెందాక, అనంతరం జరిగే పరిణామాలతో ఇక్కడ టిడిపి భవిష్యత్తుపై ఆ పార్టీ క్యాడర్‌లో ఒకింత అయోమయం నెలకొంది. టిడిపి ఆవిర్భావం నుంచి అంటే 1983 మొదలు 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో టిడిపి అప్రతిహత విజయాలు సాధిస్తూ వచ్చింది. అయితే వైఎస్ రాజశేఖరరెడ్డి చరిష్మాతో 2004 లో కాంగ్రెస్, ప్రజారాజ్యం అధినేత మెగా స్టార్ చిరంజీవి చరిష్మాతో 2009లో ప్రజారాజ్యం గెలుపొందాయి. 2014లో మరలా టిడిపి గెలవగా, 2019లో వైసిపి గెలుపొందింది. 1983 నుంచి 2019 వరకు 9 సార్లు వరుస ఎన్నికల్లో 6 సార్లు టిడిపి, చెరొక సారి కాంగ్రెస్, ప్రజారాజ్యం, వైసిపి గెలిచాయి. ఈ పరిణామాలు చూస్తే ఇక్కడ టిడిపికి రాజకీయంగా ఎంత బలం ఉన్నదీ తెలుస్తోంది. చెక్కు చెదరని కార్యకర్తలు ఉన్న టిడిపి 2019 ఎన్నికల తర్వాత కేడర్‌లో స్తబ్దత నెలకొంది. దీంతో పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి బాధ్యతలను కోరాడ రాజబాబుకు పార్టీ అధిష్టానం అప్పగించింది. ఆ నాటి నుంచి నేటి వరకూ పార్టీని నడిపించడంలో కోరాడ చురుకైన పాత్ర పోషించారని అతని అభిమానులు, పార్టీ అధినేతకు పూస గుచ్చినట్లు వివరించినట్టు తెలిసింది. తనకు టిక్కెట్ ఇస్తే 50 వేల మెజారిటీతో గెలిచి మీకు బహుమానంగా ఇస్తానని చంద్రబాబు వద్ద కోరాడ ప్రస్తావించినట్లు సమాచారం.

ఎన్నికల ప్రచారానికి ముత్తంశెట్టి శ్రీకారం..

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పార్టీ అధిష్టానం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో తన పేరు ఉండడంతో ఎంచుకున్న ముహూర్తం ప్రకారం మండలంలోని మత్స్యకార గ్రామమైన అన్నవరం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులుతో కలిసి ప్రచారం నిర్వహించారు. "ఎన్నికల్లో గెలిచేసాం" అన్న రీతిన తీన్ మార్, బాణ సంచా మోతతో ఓ వైపు, పెద్ద సంఖ్యలో కార్లు, మోటారు బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముత్తంశెట్టి మాట్లాడుతూ, మీ అందరి ఆశీస్సులతో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ యూత్ కో-ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, జెడ్‌పి వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, వ్యవసాయ శాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ డి.పెదబాబు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, ఎంపిపి వాసురాజు, జివిఎంసి నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు

సభలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం మండలంలో..

పద్మనాభం : భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆనవాయితీ ప్రకారం పద్మనాభం మండలానికి సంబంధించి ఐనాడ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఐనాడ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కోరాడ పాపారావు, మామిడి శివ, కోరాడ రామేశ్వరరావు ప్రత్యేక ఆహ్వానం పలికారు. సత్యనారాయణపు జంక్షన్ నుంచి ఓపెన్ టాప్ జీపులో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఎన్నికల శంఖారావం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, జెడ్‌పి వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, చందక పైడినాయుడు, చందక శ్రీను, కోడ్రోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో భీమిలి ఆర్‌డిఒ తనిఖీలు

ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడలో ఒక పార్టీకి చెందిన వస్తువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఫిర్యాదు రావడంతో భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యాన ఆదివారం సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ, ఓటర్లను ప్రలోబపెట్టడానికి క్రికెట్ కిట్స్, డబ్బు, డ్రెస్ మెటీరియల్ ఉన్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు భీమిలి, ఈస్ట్ టీమ్స్ తనిఖీలు చేశాయని, ఈ తనిఖీలో డబ్బు, క్రికెట్ కిట్స్ తదితరాలు లభ్యంకాలేదని చెప్పారు. ఈ తనిఖీ నివేదికను 24 గంటలలో ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు. కోడ్ వచ్చిన తర్వాత ఇదే మొదటి ఫిర్యాదు అని తెలిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేశామని చెప్పారు.

ఎన్నికల నియమావళితో విగ్రహాలకు ముసుగులు

- తొలగించిన పార్టీల హోర్డింగ్‌లు, కటౌట్లు

తగరపువలసలో వైఎస్ఆర్ విగ్రహానికి తొడిగిన ముసుగు

ప్రజాశక్తి- తగరపువలస : కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో శనివారం నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో అధికార యంత్రాంగం కదిలింది. రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, కటౌట్లను తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ ఎదురుగా జ్యూట్ కార్మికవాడను ఆనుకుని ఉన్న వైసిపి, టిడిపి కటౌట్లు తొలగించారు. పెట్రోల్ బంక్, ప్రైవేట్ మార్కెట్ వద్ద ఉన్న వైసిపి కటౌట్లు తొలగించారు. స్థానిక జంక్షన్ వద్ద, వై జంక్షన్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగు తొడిగారు.

యువతతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-సీతమ్మధార : యువతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి పార్టీ కార్యాలయంలో ఆదివారం యువజన విభాగం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి యువతకు అందించిన ప్రోత్సాహాన్ని గుర్తు చేశారు. పేదరిక నిర్మూలన, కులమతాల వివక్షను పారద్రోలడం, ప్రతి ఒక్కరిలో సమానత్వం గుర్తించే ఒకే ఒక అస్త్రం విద్య అనే నమ్మకంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంచలనాత్మకమైన నిర్ణయాలు చేశారు. ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాడే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు ఆళ్ళ లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కెవిఎన్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులోని బిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యాన యువతీ, యువకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, నాయకులు రమణి, మురళీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనకు గీతం విద్యార్థుల వాక్‌థాన్

ప్రజాశక్తి -మధురవాడ : సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఇటిఇ) విద్యార్థి విభాగం ఆధ్వర్యాన ఆదివారం బీచ్ రోడ్డులో వాక్ థాన్ నిర్వహించారు. గీతం ఇఇసిఇ విభాగాధిపతి ప్రొఫెసర్ భరణి చంద్రకుమార్, ఐఇటిఇ విభాగం కన్వీనర్ బి.సెవెన్త్‌లైన్ హజరై మాట్లాడారు. సైబర్ నేరాలలో ప్రపంచంలో 80వ స్థానంలో ఉన్నామని, ఏటా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాలలో అపరిచిత వ్యక్తులతో పంచుకోవడం, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తవహించాలన్నారు. ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ విభాగాల సహాయం తీసుకోవాలని సూచించారు. సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులు పలు నినాదాలతో కూడిన బోర్డులను ప్రదర్శించారు. కార్యక్రమానికి విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.రాజు, డాక్టర్ ఎస్.శారదారాణి సంధానకర్తలుగా వ్యవహరించారు.

వాక్‌థాన్‌లో పాల్గొన్న గీతం విద్యార్థులు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి బి.ఈశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో సీనియర్ జర్నలిస్టు ముత్తా గోవిందరావు అధ్యక్షతన జరిగిన పాయకరావుపేట ప్రెస్ క్లబ్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, అక్రిడేషన్లు రాని సీనియర్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న యూనియన్ మనదేనన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేస్తూ,యూనియన్ పటిష్టతకు కృషి చేయాలన్నారు.

సన్మానిస్తున్న జర్నలిస్టులు

అనంతరం పాయకరావుపేట ప్రెస్ క్లబ్ నూతన కార్యదర్శిగా ముత్తా గోవిందరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యత్వాల నమోదు చేపట్టారు. తనకు అప్పగించిన పదవిని సద్వినియోగం చేసుకుంటూ నియోజకవర్గంలో యూనియన్ బలోపేతానికి మరింత కృషి చేస్తానని గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నాయుడు, పాయకరావుపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పి రామం, గౌరవాధ్యక్షులు బి.రమేష్, ఉపాధ్యక్షురాలు యమ్‌విఎల్ఎన్.కుమారి, ట్రెజరర్ శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటకు తరలి వెళ్లిన నేతలు

ప్రజాశక్తి-కోటవురట్ల: బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడిగా చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు మండలం నుంచి ఆయా పార్టీల శ్రేణులు బయలుదేరి వెళ్లారు. జానకి శ్రీను జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ, వైసిపి పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రజలు బాధ్యతగా ఓటు హక్కు వినిపించ ుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు తిరుమల రావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుతున్న నాయకులు

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
S.A.13/2024

Between:
1. M/s Sri Vijaya Venkata Sai Satya Durga Rice Mill, Rep by its Proprietor Smt Bollam Padmavathi, & another
...Applicants

And:
1. The Regional Manager, Union Bank of India, Vizianagaram, Andhra Pradesh-535003, & others
...Respondents

NOTICE

R-3 SRI PALURI SRINU S/o VENKATA RAO, Hindu, aged about 50 years R/o China Doddigallu, Nakkapalli Mandal, Anakapalli District.

Please take notice and appear either in person or through an Advocate before Honourable DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM in S.A.13-2024 **on 3-4-2024 at 10:30 A.M** and file your objections if any failing which the Hon'ble Court will pass an ex-pate orders against both of you. This is the order of Honourable Court of the DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM.

D.V.V.R.PRATAP
R.SARADA NAGARJUN
ADVOCATES
VISAKHAPATNAM
Cell : 9848418166

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయ ధికారిణి పి. దమయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల చేత కథలు చదివించి, వాటిని వివరించారు. ఆమె మాట్లాడుతూచ ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు విద్యార్థులకు వివరించారు. సోమవారం నుండి ఒంటిపూట బడులతో గ్రంథాలయానికి సాయంత్రం వచ్చి చదువుకోవాలని కోరారు.

కథలు చెపుతున్న గ్రంథాలయాధికారి

వెంకన్న కల్యాణోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈనెల 19వ తేదీ నుండి స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయ గోపురాలకు, గరుడాద్రి పర్వతం మెట్ల మార్గానికి రంగులు వేసి అందముగా ముస్తాబు చేశారు. గాలిగోపురంకు ఎదురుగా భక్తుల సౌకర్యం కోసం ఎండ తీవ్రత లేకుండా తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సుమారుగా 20 రోజుల పాటు ఉపమాకలో తీర్థం జరగనుంది.

దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వ్యాపారులు

ఇందుకోసం పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఉపమాక ఆలయ పరిసరాల్లో వ్యాపారం చేసు కోవడానికి అవసరమైన దుకాణాలను తాత్కాలికంగా నిర్మించుకుంటున్నారు. ఉపమాక ఆలయానికి వచ్చే భక్తులంతా సెంటిమెంట్‌గా ఇక్కడ ఏర్పాటయ్యే దుకాణాల్లో సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకువెళ్లడం ఆనవాయితీ. చిన్నపిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, ఇత్తడి సామాగ్రి, తినుబండరాలు విక్రయించే అనేక దుకాణాలు తీర్థంలో వెలుస్తాయి. ఇందుకుగాను వ్యాపారులు తాత్కాలికంగా కమ్మలతో పాకలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి

గిరిజన మహిళలు ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట: ఉజ్వల గ్యాస్ కనెక్షన్స్ వెంటనే ఇవ్వాలని రోలుగుంట మండలం లోసింగి గ్రామ గిరిజన మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లోసింగి గ్రామంలో గత డిసెంబర్ నెలలో చలిసింగం, లోసింగి గ్రామాల్లో 30 కుటుంబాలు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం మాకవరపాలెం మండలానికి చెందిన శ్రీవెంకటేశ్వర అయ్యప్ప గ్యాస్ ఏజెన్సీ ఈకేవైసి చేశారని తెలిపారు. వీటిలో జనవరి నెలలో 13 కుటుంబాలకు ఉజ్వల ఉచిత గ్యాస్ కనెక్షన్స్ ఇస్తామని చెప్పి రూ.2600 వసూలు చేసి కనెక్షన్ ఇచ్చారన్నారు. మిగతా వారికి త్వరలోనే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి నేటికీ మూడు నెలలు అవుతున్నా గ్యాస్ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ చిరంజీవి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు, నాయకులు

సామగ్రిని ఇస్తున్న నాయకులు

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల: ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో గొట్టువాడ గ్రామంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు టిడిపి నాయకులు పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందజేశారు, సుంకర బాబ్జి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'కోడ్' కూసినా మేలుకోరా?

ప్రజాశక్తి -కోటవురట్ల: ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించి 24 గంటలు దాటింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా మండల అధికారులు ఇంకా మేల్కొలేదు. మండల కేంద్రంలోని సంచార పశు ఆరోగ్య సేవ వాహనంపై ఉన్న రాజకీయ నాయకుల ఫోటోలు తొలగించలేదు. కనీసం ముసుగు కూడా వేయలేదు. సంబంధిత అధికారులు మేల్కొని ఎన్నికల నియమావళిని పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

పశు సంచార వాహనంపై ఉన్న నాయకుల ఫొటోలు

సూచనలు ఇస్తున్న కలెక్టర్

చెక్‌పోస్టులో కలెక్టర్, ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టను ఆదివారం రాత్రి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జిల్లా ఎస్‌పి కె.వి. మురళీకృష్ణ తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ గుండా వెళ్లే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో 9చెక్ పోస్టులు ఉన్నాయని, అవసరాన్ని బట్టి మరిన్ని పెంచుతామన్నారు. ఇందు కోసమే జాయింట్ తనిఖీ చేస్తున్నామన్నారు. అదే విధంగా 25 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయని, స్టాటిక్ సర్వైలెనే టీమ్స్ 24 వస్తాయన్నారు. నిరంతరం తనిఖీ ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి, తహసీల్దార్ శ్రీకాంత్, సిఐ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల అవస్థలు

-ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని ర్యాంపు, ఇనుప రైలింగ్

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే విభిన్న ప్రతిభావంతులకు అధికారులు కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే తహసిల్దార్ కార్యాలయంలోనికి వెళ్లేందుకు వికలాంగులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఈ కార్యాలయం వద్ద మెట్లు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మెట్లు దిగేందుకు, ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారు. కార్యాలయం నిర్మాణం చేపట్టి దశాబ్దాలు గడుస్తున్నా ఇంతవరకు ర్యాంపు, ఇనప రైలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వికలాంగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

మెట్లు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న వికలాంగుడు

విగ్రహానికి వేసిన ముసుగు

విగ్రహాలకు ముసుగులు

ప్రజాశక్తి-రోలుగుంట: ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో మండల తహశీల్దార్ రవిచంద్ర ఆదేశాల మేరకు మండల కేంద్రం, మండలంలోని పంచాయతీ గ్రామాల్లోని రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. వైయస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కుర్మన్నపాలెం - దువ్వాడ రోడ్డుపై నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రోడ్ల దుస్థితిపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ఆ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పన్నుల రూపంలో వసూలు చేసుకుంటున్న ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యం వేలాదిమంది కుర్మన్నపాలెం మీదుగా దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళుతుంటారని తెలిపారు. అధ్వానంగా తయారైన ఈ రోడ్ల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అధ్వానంగా ఉన్న రోడ్డు పక్కనే ఎలాంటి రక్షణ లేకుండా డ్రైనేజీ ఉందని తెలిపారు. వెంటనే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.అయోధ్యరాం, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వరరావు, దత్తాత్రేయరాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అదీప్‌రాజు అనుచరులు

ఎమ్మెల్యే అదీప్ రాజు ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం వైసిపి అభ్యర్థిగా ఎమ్మెల్యే అదీప్‌రాజు పేరు ఖరారు కావడంతో ఆదివారం మిలాన్ కల్యాణమండపం నుంచి పెందుర్తి కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభిమానులు, కార్యకర్తలు తనను గెలిపించాలని కోరారు.

ప్రచారంలో భాగంగా రోడ్డులో ఆగి ఉన్న ఒక కారును కొంతమంది కార్యకర్తలు ఢీకొట్టారు. దీనిపై కారు యాజమాని ప్రశ్నించడంతో ఆయనపై వైసిపి కార్యకర్తలు తిరగబడ్డారు. అక్కడ ఉన్న పోలీసులు వచ్చి వివాదాన్ని సద్దుమణిగించారు.

మురికివాడల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలి

ప్రజాశక్తి -ములగాడ : మురికివాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ప్రజా చైతన్యానికి స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి పిలుపునిచ్చారు. సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల యూనిట్ -1, 2 ఆధ్వర్యాన ఇందిరా కాలనీ, బర్మా కాలనీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాల్లో ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యం, రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం తదితరాలు ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని, వాటి కల్పనకు స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులు ప్రభుత్వాలకు చేయూతనివ్వాలని కోరారు. 'మురికివాడలు- సమస్యలు- పరిష్కారాలు' అనే అంశంపై ఆమె ప్రత్యేక ప్రసంగం చేశారు. అంతకుముందు వాలంటీర్లు గ్రూపులుగా ఏర్పడి ఇందిరా కాలనీ, బర్మా కాలనీలో వివిధ ప్రాంతాలను సందర్శించి, సామాజిక సమస్యలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవడం వల్ల విద్యార్థుల వ్యక్తిత్వం వికసిస్తుందని, వారు నాయకులుగా తయారవుతారని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఐపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు ఎ.సంధ్యారాణి, ఎన్.నదియా పాల్గొన్నారు.

ధన్యజీవి అప్పలస్వామి

సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి- ములగాడ : దుర్గానగర్ గ్రామ ప్రజలకు ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, కుళాయిలు, రోడ్లు, వీదిలైటు సమస్యలపై పనిచేసి, వారి మనస్సులో ధన్యజీవిగా తియ్యాల అప్పలస్వామి నిలిచారని వక్తలు కొనియాడారు. ఇటీవల మృతిచెందిన తియ్యాల అప్పలస్వామి సంస్మరణ సభను 62వవార్డు దుర్గానగర్‌లో ఆదివారం నిర్వహించారు. అప్పలస్వామి చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు యువిఎస్‌ఎన్.వర్మ పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం దుర్గానగర్ శాఖ కార్యదర్శి పి.అర్జునరావు అధ్యక్షతన జరిగిన సభకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అప్పలస్వామి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి ప్రాణం విడిచే వరకు పనిచేశారన్నారు. సిపిఎం పద్ధతుల్లోనే జెండా కప్పి అంత్యక్రియలు జరపాలని భార్యకు, కుమార్తెలు, అల్లుళ్లకు చెప్పారని తెలిపారు. ఆ పద్ధతుల్లోనే అంతిమయాత్ర జరిగిందన్నారు. ఆంధ్ర స్టీల్ కంపెనీలో పనిచేసిన సమయంలో సిఐటియులో చేరి కార్మిక హక్కులపై పోరాటంలో ముందుండేవారన్నారు. దుర్గానగర్‌లో డివైఎఫ్ఐ, భవన నిర్మాణసంఘాలను ఏర్పాటుచేశారని తెలిపారు. ప్రజానాట్యమండలిలో కళాకారునిగా గజ్జకట్టి, డప్పుకొట్టి పాటలుపాడేవారని తెలిపారు. భార్య అసిరమ్మను ఐద్వాలోనూ, సిపిఎంలో చేర్పించి ఇద్దరూ కలిసి దుర్గానగర్ గ్రామ ప్రజల సమస్యలపై పనిచేశారన్నారు. నిజాయతీపరుడు అప్పలస్వామి అన్నారు. ఆర్‌టిసి ఉద్యోగం చేస్తూ కూడా పార్టీ పనిలో ఉంటూ గ్రామంలో ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేశారని తెలిపారు. ఆయన ఆశయసాధనకు మనమంతా పనిచేసినప్పుడే అప్పలస్వామికి మన మిచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు యువిఎస్‌ఎన్.వర్మ మాట్లాడుతూ, ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకొని చివరి వరకు సిపిఎంలోఉండి ప్రజల మనిషిగా అప్పలస్వామి నిలచాడన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, ప్రజలు, కార్మికులపై ప్రభుత్వాలు వేస్తున్న భారాలను తగ్గించాలని సిపిఎం చేసిన పోరాటాల్లో పాల్గొంటూ ప్రజల మనిషిగా అప్పలస్వామి నిలిచాడన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ, అప్పలస్వామి మృతి పార్టీకి, దుర్గానగర్ ప్రజలకు తీవ్ర లోటని అన్నారు. ఈ సభలో అప్పలస్వామి భార్య అసిరమ్మ, కుమార్తెలు చైతన్య, సంతోషి, అల్లుళ్ల గణేష్, శ్రీకాంత్, తమ్ముడు సింహాచలం, ఆర్‌టిసి యూనియన్ నాయకులు తులసీరావు, సిఐటియు జిల్లా నాయకులు జి.పొలేశ్వరరావు, ఎస్.జ్యోతీశ్వరరావు, పి.మణి, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆర్.విమల, దుర్గానగర్ ఐద్వా నాయకులు పి.వరలక్ష్మి, సిపిఎం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, వి.బాబూరావు, ఎ.సత్యారావు, కె.పెంటారావు, ఎల్.కృష్ణ, డివైఎఫ్ఐ జోన్ కార్యదర్శి ఎస్.వాసు పాల్గొన్నారు. అప్పలస్వామిపై ప్రజానాట్యమండలి నాయకులు నీలకంఠారావు పాడిన ఎర్రజెండా ముద్దు బిడ్డ, వేగుచుక్క కన్నీటి జోహార్లు పాటతో సభలోని వారంతా కన్నీటి పర్యంతమయ్యారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి అండగా ఉంటా...

గుడివాడ అమర్‌నాథ్

సమావేశంలో మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి -గాజువాక : గడిచిన 15 సంవత్సరాలుగా పార్టీ కోసం శ్రమిస్తున్న వారికి సముచిత స్థానం కల్పించే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. టిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ శ్రేణులు కలిసి పనిచేస్తే మన విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రత్యేక పరిస్థితులు, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తనను ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని వెల్లడించారు. గుడివాడ, తిప్పల కుటుంబాలకు మూడు తరాల రాజకీయ అనుభవం ఉందన్నారు. పవన్‌కల్యాణ్‌పై నాగిరెడ్డి పోటీ చేసినప్పుడు మింది నుంచి మంచి మెజార్టీ తీసుకొచ్చి నాగిరెడ్డి విజయానికి సహకరించామని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ, జండా పట్టుకుని పనిచేసే కార్యకర్తలను అమర్‌నాథ్ ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, వారికి మేలు చేస్తారని చెప్పారు. వర్గ విభేదాలు మాని నాగిరెడ్డి నాయకత్వంలో కలిసి పనిచేద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, అమర్‌నాథ్ గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ టికెట్ ఇచ్చిన అభ్యర్థి విజయానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వైసిపి నాయకులు గుడివాడ లతీష్, పల్లా చినతల్లి, భోగది సన్నీ, ధర్మాల శ్రీనివాస్ రెడ్డి, సిరట్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

పలువురు కార్పొరేటర్లు డుమ్మా..

ఈ సమావేశానికి గాజువాకకు చెందిన పలువురు వైసిపి కార్పొరేటర్లు డుమ్మాకొట్టారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కూడా హాజరుకాలేదు.

హోమియో వైద్య శిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన సంస్థ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ సుమారు వంద మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న వాహనం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి- పెదబయలు: విశాఖపట్నంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో అపశృతి చోటు చేసుకుంది. స్థానిక ఏఎస్ఐ బొబ్బిలి లక్ష్మణరావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. ముంచింగిపుట్టు మండలం నుండి హారాభిర్ గ్రామానికి చెందిన కొందరు బొలెరా వాహనంలో విశాఖపట్నం కాంగ్రెస్ సభకు వెళ్లి వస్తున్నారు. పెదబయలు మండలం అరడకోట పంచాయతీ సమీపంలోని శివాలయం ఎదురుగా ఉన్న తాటి చె ట్టును ఢీ కొట్టడంతో వంతల లవకుశ (51) అక్కడికక్కడే మృతి చెందగా వసంతల సీతారాం తలపై బలమైన గాయాలు కావడంతో అల్లూరి జిల్లా ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహానికి పంచనామ అనంతరం బంధువులకు అప్పగించడం జరిగిందని ఏఎస్ఐ తెలిపారు.

మంటల్లో చిక్కుకుని చెరుకు రైతు దుర్మరణం

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట : చెరకు చెత్తకు పెట్టిన నిప్పు రాజుకుని, ప్రమాదవశాత్తు అంటుకోవడంతో రైతు దుర్మరణం పాలైన ఘటన ఆదివారం మండల కేంద్రం బుచ్చయ్యపేటలో చోటుచేసుకుంది. వివరాలివి. బుచ్చయ్యపేటకు చెందిన సుంకర పోతురాజు(68) అనే రైతు తన పొలంలోని చెరుకు నరికేయగా మిగిలిన చెత్తకు ఆదివారం నిప్పుపెట్టారు. విపరీతంగా గాలివీయడంతో, మంటలు ఇతర పొలాలకు వ్యాపించడంతో వాటిని ఆర్పే క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడి మృత్యువాత పడ్డాడు. దీనిపై మృతుని కుమారుడు సుంకర రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

ప్రజాశక్తి- మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకూతురు అదృశ్యమైనట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి ఐదో వార్డు పరిధి బోయపాలెం స్వచ్ఛభారత్ నగర్‌కు చెందిన జి.రాంబాబు, భార్య భవాని, రెండేళ్ల కుమార్తె కౌసల్యతో పాటు అత్తమామలతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 13న ఉదయం రాంబాబు విధులకు వెళ్లాడు. అత్తమామలు కూడా కూలి పనికి వెళ్లిపోయారు. సాయంత్రం వారంతా ఇంటికి వచ్చేసరికి తాళం వేసి ఉంది. భవాని, కుమార్తె కౌసల్య కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంబాబు ఫిర్యాదు మేరకు హెచ్‌సి శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా అనంతుని పెళ్లిరాట

ప్రజాశక్తి-పద్మనాభం : అనంతపద్మనాభస్వామి పెళ్లిరాట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పద్మనాభం గ్రామంలో ఉన్న అనంతపద్మనాభం స్వామి తిరుకళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పెళ్లిరాటను ఇఒ నానాజీబాబు ఆధ్వర్యాన ఆలయ పురోహితులు సీతారామాంజనేయులు, వేదపండితులు నిర్వహించారు. కుంతీమాధవస్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవిభూదేవి సమేతుడైన అనంతుని ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణ అనంతరం గాలి గోపురం వద్ద పెళ్లి రాట ఉత్సవాన్ని ఏర్పాటుచేశారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవానికి సంబంధించి నేరేడు కొమ్మ, తిరగళ్లు, రోకళ్లతో పసుపుకొమ్ములను దంచారు. ఈ నెల 20 నుంచి జరుగునున్న కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాలాడ పాప, పద్దు దంపతులు, బి.సన్యాసినాయుడు, సుంకర నారాయణరావు, టి.పైడిరాజు, మొకర సన్నిబాబు, జి.పద్మనాభం, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పనగర్‌లో బల్లల పండగ

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 51వార్డు అయ్యప్పనగర్‌లో శ్రీ వెంకటేశ్వర రజక సమైఖ్య సేవా సంఘం ఆధ్వర్యాన బల్లల పండగను నిర్వహించారు. 51వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఈ పండగలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబటి శైలేష్, కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, తిరుమలరావు, దమయంతి, శ్యామ్, రత్నం, వి.వరలక్ష్మి, అప్పారావు మాస్టర్, గణేష్, చిన్ని, భాను, మడక సూరిబాబు, కె.అచ్చిబాబు, సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ఎన్.రాజు, వేదికపై డాక్టర్ నిహాల్, కామేశ్వరరావు

నిద్రలేమి అనారోగ్య హేతువు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిద్రలేమి వల్ల అనేక రోగాలు చుట్టుముట్టే అవకాశం ఉందని, గుండె జబ్బు బారినపడే వీలుంటుందని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఎన్ఎన్.రాజు అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ సహకారంతో ప్రపంచ నిద్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నిద్రలేమి, కలత నిద్ర అంశంపై మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో నిద్ర ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటుందన్నారు. అందరికీ కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర తప్పనిసరి అన్నారు. నిద్ర లేకపోతే శాంతి లభించదన్నారు. అందుకే ప్రతి మనిషికి రోజులో 7 నుండి 8 గంటలు నిద్ర అవసరమన్నారు. నిద్ర వల్ల శరీరంలో అనేక మార్పులు వస్తాయని తెలిపారు. నిద్రలో మెదడు ప్రధాన భూమిక నిర్వహిస్తుందన్నారు. నిద్రలేమి వల్ల ఏకాగ్రత లోపించడం, జ్ఞాపక శక్తి తగ్గడం, దిగులు, ఆందోళనతో పాటు బిపి, సుగర్ నియంత్రణలో లేకపోవడం వంటి స్థితి కలగవచ్చన్నారు. హార్ట్ ఎటాక్, పక్షవాతం వంటి రోగాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. మంచి నిద్రకు తీసుకోవలసిన సలహాలను వివరించారు. కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్దేశకుడు డాక్టర్ ఎన్‌జి,నిహాల్ మాట్లాడుతూ నిర్దిష్ట సమయానికి నిద్రకు ఉపక్రమించడం, పౌష్టిక ఆహారం తీసుకోవడం, రెండు కిలోమీటర్లు నడవడం, టీ, కాఫీ, మద్యం వంటి ఉత్ప్రేరకాలను తీసుకోకపోవడం, కొంత చీకటి గదిలో నిద్రించడం వంటి సలహాలను పాటించాలని కోరారు. అలాగే మొబైల్, టీవి అతిగా వినియోగించడం నిద్రాభంగానికి దారి తీస్తుందని తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ఆరోగ్య వేదిక అధ్యక్షులు టి.కామేశ్వరరావు అధ్యక్షత వహించారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి -గాజువాక : పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులతో అందరూ ఉత్తీర్ణత సాధించాలని భాస్కర్ విద్యా నికేతన్ పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు విద్యార్థులకు సూచించారు. చట్టివానిపాలెంలోని భాస్కర్ విద్యా నికేతన్‌లో ఆదివారం 10వ తరగతి విద్యార్థుతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. పరీక్షలు ఎలారాయలో, పరీక్ష హాల్‌లో ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరికీ పరీక్షలు రాయడానికి అట్టలు, స్కేళ్లు అందజేశారు.

షిప్‌యార్డ్ కార్మికుల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ములగాడ : హిందుస్థాన్ షిప్‌యార్డ్ టిఎన్‌టియుసి కార్మికుల సర్వసభ్య సమావేశం ఆదివారం సింహాచలం శ్రీకృష్ణ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గణబాబు, టిఎన్‌టియుసి విశాఖ జిల్లా సెక్రెటరీ నక్క లక్ష్మణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, హిందుస్థాన్ షిప్‌యార్డు కార్మికులకు అండగా ఉంటానన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. షిప్ యార్డ్ టిఎన్‌టియుసి గౌరవాధ్యక్షులుగా రమణ, అధ్యక్షులుగా ఉరుకూటి మురళీధర్, సెక్రటరీగా సిహెచ్.రాము, కోశాధికారిగా ఎం.మహేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కె.ఆదిబాబు, ఎగ్జిక్యూటివ్ బాడీని ఎన్నుకున్నారు. తారకరత్న వెల్ఫేర్ చైర్మన్‌గా జె.జగదీష్‌కుమార్, ప్రచార కమిటీ చైర్మన్‌గా ఇ.కూర్మారావు, ఫ్యాక్టరీ కమిటీ చైర్మన్‌గా కన్నబాబును ఎన్నుకున్నారు. ఎంవి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించండి

ప్రజాశక్తి- కశింకోట : వైసిపి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి, ఓటేయాలని ప్రజలను అభ్యర్థించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు .ఆదివారం ఉగ్గినపాలెం మలసాల కిషోర్ గెస్ట్ హౌస్ దగ్గర నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, రానున్న ఐదేళ్లు ప్రజాసేవకునిగా పనిచేస్తానని, తనకు ఓట్లేసి గెలిపించాలని కోరారు కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపిపి కలగ లక్ష్మీ గున్నయ్య నాయుడు, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు ఎఎంసి చైర్మన్ గొల్లివిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - భీమునిపట్నం : సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు మండలం, జివిఎంసి పరిధిలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ ఎం.శివరాణి తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షా కేంద్రానికి ఉదయం 8.45 గంటలకే చేరుకోవాలని వివరించారు. 22 జెడ్పీ, గురుకుల, ఉన్నత పాఠశాలల నుంచి 709 మంది బాలికలు, 495 మంది బాలురు, మొత్తంగా 1204 మంది, 18 ప్రైవేట్ పాఠశాలల నుంచి 557 మంది బాలికలు, 848 మంది బాలురు, మొత్తంగా 1405 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్, తగినంత ఫర్నిచర్ సదుపాయాలు ఇప్పటికే కల్పించినట్లు వివరించారు. వైద్య శాఖ ఆధ్వర్యాన సిబ్బంది, మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

పద్మనాభం : మండలం 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది 702 మంది విద్యార్థులు నాలుగు పరీక్ష కేంద్రాల్లో రాయనున్నారని ప్రకటించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు.

మారేడుమిల్లి: : ఈ నెల 18 నుంచి 30 వరకు మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మారేడుమిల్లి ఎంఇఒ బళ్ల తమ్మారావు తెలిపారు. మండలంలో మొత్తం 338 మంది బాలబాలికలు టెన్త్ పరీక్షలు రాయబోతున్నారన్నారు. వీరికి మారేడుమిల్లి బాలురు గురుకుల పాఠశాల, బోదులూరు బాలికల ఆశ్రమ పాఠశాలలో రెండు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

విఆర్.పురం: . మండలంలోని విఆర్ పురం జెడ్‌పి హైస్కూల్, సున్నంవారి గూడెం ఎహెచ్‌ఎస్ రెండు కేంద్రాల్లో సోమవారం నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యశిబిరం, మరుగుదొడ్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు 19మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరెంటిండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

రాజవొమ్మంగి: మండలంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్నిఏ ర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ-2 సూరారెడ్డి తెలిపారు. టెన్త్ పరీక్షలకు మండలంలోని రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాల, సింగంపల్లి ఆశ్రమ పాఠశాల మూడు పరీక్షా కేంద్రాల్లో 10 పాఠశాలలకు చెందిన 439 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు, పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్యం, ఫర్నిచర్ ఇతర సౌకర్యాలన్నీ కల్పించినట్లు తెలిపారు.

సీలేరు: మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పది పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చీఫ్ సూపరెంటిండెంట్ హేమచంద్ర వెల్లడించారు. సీలేరు పరీక్ష కేంద్రంలో ఎపి గురుకుల పాఠశాల, డిఎవి పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 127 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారిగా సాగిన వెంకటరమణ వ్యవహరించనున్నారు.

నైస్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ నియామకం

ప్రజాశక్తి -ములగాడ : శ్రీహరిపురం కోరమండల్ వద్ద ఉన్న జివిఎంసి గ్రౌండ్ నైస్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సాగర్ దుర్గ గుడి వద్ద అసోసియేషన్ అధ్యక్షులు హరికృష్ణ ఆధ్వర్యాన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 60వ వార్డు కార్పొరేటర్, నైస్ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పివి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాకింగ్ ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నైస్ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా పివి సురేష్‌ను మరోసారి ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాండ్రంగి జయరాజునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరావు జనరల్ సెక్రటరీగా నెహ్రు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ప్రసాద్, మోహన్, వైస్ ప్రెసిడెంట్‌లుగా సాంబశివరావు, నారాయణరావు, సెక్రటరీలుగా చిన్న, ప్రసాద్, ట్రెజరర్లుగా సూర్యారావు, శేఖర్, ముఖ్య సలహాదారులుగా బుల్లబ్బాయ్, టిఎస్.రావు, డి.నూకరాజు, సత్యనారాయణ, గోపిరాజు, రామకృష్ణ, చిన్న, నాగు, దుర్యోధనరావు ఎన్నికయ్యారు.

వేసవిలో పక్షుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -అనకాపల్లి : వేసవిలో పక్షుల సంరక్షణ అందరి బాధ్యత కావాలని రాష్ట్ర జీవ వైవిధ్య, సంరక్షణ అవార్డు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ పిలుపునిచ్చారు. దీనికోసం పక్షి గూళ్లు, తాగునీటికి మట్టిపాత్రలు, దాణా ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివారం ్ౖల గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు దేవాలయాల్లో ధాన్యపు కుంచులు, నీటి పాత్రలు, పక్షి గూళ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండుటెండలకు పెరిగే ఉష్ణోగ్రతలతో వేసవితాపాన్ని తట్టుకోలేక కొన్ని పక్షిజాతులు అంతరించే ప్రమాదం వుందని, వాటి సంరక్షణకు పదేళ్లుగా తమవంతు బాధ్యతగా వీటిని అందజేస్తున్నామన్నారు.

గ్రీన్‌క్లబ్ సేవల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, ఆళ్ల నాగేశ్వరరావు, విల్లూరి పైడారావ్, చిన్నస్వామి డాక్టర్ గణేష్, డాక్టర్ రాజేష్, బి వినోద్‌కుమార్, ఆర్‌టిసి సత్యనారాయణ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయసాధన సభ విజయంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విజయ రెసిడెన్సీలో జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బిజెపితో పొత్తు కట్టిన టిడిపి, జనసేనలను ఓడించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐ.ఆర్.గంగాధర్, నేతలు తనకాల అనంతరావు, ఎమ్.వి.ఆర్.రాహుల్, మలపరెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, దాసరి సంతోష్, కటుమూరి నూక అప్పారావు, సనేడ గజ్జాలు, బొంతు రమణ, ఎమ్.చక్రవర్తి పాల్గొన్నారు.

విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - నక్కపల్లి : కేన్సర్‌పై నక్కపల్లి మండంలోని వేంపాడులో మానవ సేవ సంస్థ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. స్త్రీ, పురుషుల్లో వచ్చే కేన్సర్ల రకాలను ప్రతినిధులు వివరించారు. హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 19వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్ సమక్షంలో పలువురు టిడిపి కార్యకర్తలు ఆదివారం వైసిపిలో చేరారు. వారికి వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ పార్టీ కండువాలు మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సూరాడ దాసు, వాడమోదుల గణేష్, బెహరా వసంత తదితరులు పాల్గొన్నారు. 22వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీతల గోవింద్ సమక్షంలో రాజీవ్ నగర్ ప్రాంతానికి చెందిన వంద మంది వైసిపిలో చేరారు. వారికి పార్టీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమనేని వెంకటేశ్వరరావు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉమర్, శ్రీకాంత్, ఎల్లాజీ, జగదీష్, శ్రీను, గణేష్ పాల్గొన్నారు.

వైసిపి అవినీతి, అక్రమాలను ఎండగట్టండి

ప్రజాశక్తి-అనకాపల్లి : సోషల్‌మీడియా వేదికగా సిఎం జగన్, వైసిపి ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలో వెయ్యిమందితో సోషల్‌మీడియా టీం ఎంతో ఉత్సాహంగా పనిచేస్తోందన్నారు. వైసిపి అసత్యప్రచారాలను తిప్పికొట్టడంతోపాటు ఉమ్మడి అభ్యర్థుల విజయానికి ప్రచారాన్ని విస్తృతం చేయాలన్నారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యేగా కొణతాల రామకృష్ణ విజయానికి పనిచేయాలన్నారు. పార్టీ విజయంలో సోషల్ మీడియా వారియర్స్ కీలకభూమిక పోషించాలని పీలా గోవింద పిలుపునిచ్చారు.

'స్పందన' రద్దు

ప్రజాశక్తి-అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలును దృష్టిలో పెట్టుకుని, ఎన్నికలు ముగిసే వరకు ప్రతిసోమవారం నిర్వహించిన స్పందనను రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోనిప్రజలు గమనించి, దరఖాస్తులు, ఫిర్యాదులతో కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

డంపింగ్ యార్డ్ తరలింపులో విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణం నడిబొడ్డున ఉన్న డంపింగ్‌యార్డు తరలింపులో స్థానిక అధికారపార్టీ నేతలు, వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు యాదవ్ ఆరోపించారు. ఆదివారం జివిఎంసి జోనల్ కార్యాలయంలోని డంపింగ్‌యార్డు వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు.ఐదేళ్లుగా ధర్నాలు, నిరసనలు, దీక్షలు, ఫిర్యాదులు, వినతులిచ్చినా తమకేమీ పట్టనట్లు అనకాపల్లిని అందాలపల్లి చేస్తానన్న స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌గానీ, స్థానిక ఎంపీ బివి.సత్యవతిగానీ ఇసుమంతైనా స్పందించకపోవడం విచారకరమన్నారు. విపక్షంలో ఉన్నపుడు ఎన్నో సవాళ్లు విసిరిన వైసిపి నేతలంతా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు దీని ఊసెత్తలేదని, దీనికి తగిన ప్రతిఫలం తప్పదని హెచ్చరించారు.